క్లుప్తంగా

1 నుంచి క్రికెట్ పోటీలు

కుంటాల: మండలంలోని విఠాపూర్‌లో గ్రామస్తుల సహకారంతో ఏప్రిల్ 1నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ రుసుం రూ.1200 కాగా విజేతగా నిలిచిన జట్టుకు రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12,500 అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 79975 63985, 99128 58907 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు 'చలో ఢిల్లీ'

నిర్మల్‌టౌన్: ఈనెల 31న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని రాంలీలా మైదానంలో చేపట్టినట్లు తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందించడంలో కేజ్రీవాల్ దేశంలోనే ముందు వరుసలో ఉన్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి మహేశ్

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల పశువైద్యాధికారి మహేశ్ మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందన్నారు. గోపాలమిత్రలు జంగం సురేందర్, భోజన్న, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన సప్తాహం

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. భక్తులకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ, సప్తాహం కమిటీ సభ్యులు, వార్‌కరి భక్తులు తదితరులు ఉన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్మల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కవితారెడ్డి, లైబ్రరీ సెక్రెటరీగా ఎన్నికైన అర్చనను పలువురు న్యాయవాదులు పూలమాల, శాలువాతో సన్మానించారు. వీరి ఎంపికకు కృషి చేసిన తోటి న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొజెక్టర్ అందజేత



ప్రొజెక్టర్ అందిస్తున్న విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు రూ.40 వేల విలువైన ప్రొజెక్టర్‌ను అందజేశారు. ఏటా పదో తరగతి పూర్తి చేసే విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారం అందిస్తారని ప్రధానోపాధ్యాయులు సారథి రాజు పేర్కొన్నారు. వీరిని పాఠశాల సమితి కార్యదర్శి సుదర్శన్, పాఠశాల కార్యదర్శి మానాజీ, సహకార్యదర్శి వేద పాఠక్ నిశికాంత్ అభినందించారు.

మతసామరస్యం చాటిన యువకుడు

కుంటాల: మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన వెల్డింగ్ షాప్ యజమాని ఖదీర్ కుంటాలలో వీరాంజనేయ ఆలయంలో హనుమాన్ దీక్షాపరులకు శుక్రవారం భిక్ష ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు. అనంతరం ఖదీర్‌ను వారు సన్మానించి అభినందించారు. గురుస్వామి భుజంగం గణపతి, నవీన్ , సంజీవ్, శ్రీనివాస్, ప్రవీణ్, రాకేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సామాజిక పరివర్తన మహిళా సంక్షేమసంఘం ఆధ్వర్యంలో రమేశ్‌రెడ్డి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు 200 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందించారు. ఆర్థోపెడిక్ వైద్యులు శివ కుమార్, ఫల్మనాలజిస్టు శ్రీనివాస్, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ఎంపీటీసీ వనిత, గంగాధర్, వీడీసీ సభ్యులు సురేశ్, గంగారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. ఈ దవాఖాన

- నర్సాపూర్(జి) సీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు
- 13నెలల్లో 390 ప్రసవాలు
- సిబ్బంది పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నర్సాపూర్(జి)లో సామాజిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రి సిబ్బందితో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి

నర్సాపూర్(జి): ఒకప్పుడు నాసిరకం వైద్య సేవలు అందిస్తారని సర్కారు దవాఖానాలకు వెళ్లేందుకు ప్రజలు జంకేవారు..దీంతో అప్పులు చేసి ప్రైవేటుకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంది.

సొంత భవనం, అధునాతన పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ 2022 జనవరిలో రాష్ట్రంలో 61 పీహెచ్‌సీలను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి వైద్యవిధాన పరిషత్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆమోదం తెలిపింది. అందులో నర్సాపూర్ (జి) ఆసుపత్రి ఒకటి. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో రోజు 100మంది పైగా అవుట్ పేషెంట్లు వివిధ రకాల జబ్బులతో వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు.

ఆసుపత్రిలో అందుతున్న సేవలు..

ఆసుపత్రిలో ప్రతి సోమ, గురువారాల్లో గర్భిణులకు రక్త, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళ, శుక్రవారాల్లో గర్భిణులకు ప్రసవాలు ఆపరేషన్లు చేస్తారు. అత్యవసరమైతే అన్ని రోజుల్లో అపెండెక్స్, హైడ్రోసిల్, హెర్నియా, కణతుల తొలగింపు, ట్యూబెక్టమీ వంటి ఆపరేషన్లు చేస్తున్నారు. గర్భిణులకు మూడు నెలలు నిండినప్పటి నుంచి తొమ్మిది నెలలు పూర్తయ్యే వరకు వివిధ పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు. తల్లిబిడ్డల ఆరోగ్యంపై దృష్టి సారించి సాధారణ, సుఖ ప్రసవాలు జరిగేలా ఇక్కడి వైద్యసిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. దీంతో చాలా మంది ఇక్కడ చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ..

చుట్టు పక్కల ఉన్న దిలావర్‌పూర్, కుంటాల, లోకేశ్వరం మండలాల నుంచి రోగులు అధిక సంఖ్యలో నర్సాపూర్(జి) సీహెచ్‌సీకి వచ్చి వైద్యసేవలు వినియోగించుకుంటున్నారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది ఉత్తమ పనితీరు కనబరుస్తుడటంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బంది..

సీహెచ్‌సీలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్-1, గైనకాలజిస్ట్-1, చిల్డ్రన్ స్పెషలిస్ట్-1, అనస్థీషియా-1, ఆప్తామాలజిస్ట్-1, ఎంబీబీఎస్ డాక్టర్లు-2, హెడ్ నర్సులు-2, స్టాఫ్‌నర్సులు-17, ల్యాబ్ టెక్నీషియన్-1, ఫార్మసిస్ట్-1 విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ సీహెచ్‌సీలో జనవరి 2023 నుంచి 2024 జనవరి వరకు మొత్తం 390 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 72 కాగా.. సీజేరియన్లు 318 ఉన్నారు.

సిబ్బంది భర్తీతో తొలగిన ఇబ్బందులు..

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఆసుపత్రి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారడం, ఇటీవల ప్రభుత్వం కొత్తగా 14 మంది స్టాఫ్‌నర్సులను ఆసుపత్రికి కేటాయించడంతో రోగులకు ఇబ్బందులు తొలగిపోయాయి.

సౌకర్యాలు బాగున్నాయి



ఈ ఆసుపత్రిలో సౌకర్యాలు బాగున్నాయి. వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ..జాగ్రత్తలు చెప్పారు. ఇటీవలే నాకు సీజేరియన్ జరిగింది. పాప పుట్టింది. పైసా ఖర్చు లేకుండా వైద్యం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి ఉంటే రూ.30 వేల వరకు ఖర్చయ్యేది.

– శ్రీయ, బాలింత, కనకాపూర్, మం.లోకేశ్వరం

సేవ చేయడం అదృష్టం



ఇటీవలే నాకు స్టాఫ్‌నర్సుగా ఉద్యోగం రావడంతో నర్సాపూర్ (జి) సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్నా. ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– షాహెదా, స్టాఫ్‌నర్సు

సద్వినియోగం చేసుకోవాలి

ప్రైవేట్ ఆస్పతులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దు. ప్రభుత్వం సర్కారు దవాఖానాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– దేవేందర్ రెడ్డి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, పిప్రి గ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. ఉదయం నుంచే చర్చిలో పాస్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా పాస్టర్ క్రీస్తు సందేశం వివరించారు. అనంతరం క్రైస్తవులు శిలువ చేత పట్టుకొని ఏసు గీతాలను ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆనందం, ప్రేమానందం, విలాస్, దేవన్న, సతీష్, దేవన్న, గంగన్న, నర్సయ్య, రత్నయ్య, సత్యానందం, సాగర్, దావీద్, దేవన్న, నవీన్, సదానందం, గంగన్న, భూమన్న పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంతోపాటు మాదాపూర్‌లో శుక్రవారం పాస్టర్ సామేల్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. బైబిల్ గ్రంథాన్ని పఠించారు. శిలువ వేయక ముందు క్రీస్తు ఇచ్చిన సందేశాన్ని పాస్టర్ వివరించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో సోన్ చర్చి క్రైస్తవులు, మాదాపూర్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.



లోకేశ్వరం: రాయపూర్‌కాండ్లీలో ప్రార్థనలు

మామడ: మండలంలోని కొరిటికల్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ ప్రభాకర్ గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు.

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: పట్టణంలోని సీఎస్ఐ చర్చితోపాటు సుర్జాపూర్, ఎల్లాపూర్, మస్కాపూర్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లోకరక్షకుడు ఏసు ప్రభువు ప్రజలకు ఇచ్చిన సందేశాన్ని పాస్టర్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో క్రైస్తవులు పాల్గొన్నారు.



సోన్: మాదాపూర్‌లో సందేశం చెబుతున్న పాస్టర్



మామడ: కొరిటికల్ చర్చిలో..

అపరిచితులు కన్పిస్తే సమాచారమివ్వాలి

- ముధోల్ సీఐ మల్లేశ్

ముధోల్: అపరిచితులు కన్పిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్ సెర్చ్) ప్రోగ్రాం నిర్వహించారు. ఉదయాన్నే పోలీసులు గ్రామానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 55 ద్విచక్రవాహనాలు, 6 ఫోర్‌విల్లర్స్ పట్టుకున్నారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు కలిసి మెలసి ఉంటూ అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలన్నారు. పండగలు, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. వారి వెంట ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ మల్లేశ్

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

ఖానాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ సైదారావు తెలిపారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో 30 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీ చేశారు. అనుమానితుల వివరాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతీ వాహనాలకు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా 41 ద్విచక్ర వాహనాలతోపాటు 6 ఆటోలు, 3 కార్లు, ఒక టాటా ఏస్ వాహనానికి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సైలు లింబాద్రి, శంకర్, అర్షాత్‌అలీ, కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడారిలా వాగులు



పెంబిలోని చిక్‌మాన్ వాగు దుస్థితి

రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో మారుమూల మండలాలైన పెంబి, కడెం, ఖానాపూర్‌ను కలుపుకొని కడెం ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో ఉన్న వాగులు భానుడి ప్రతాపానికి ఎడారిలా మారుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో నీరు లేక వాగులు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. మూగజీవాలు దాహం తీర్చుకునేందుకు తల్లడిల్లుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పెంబి మండలంలోని వస్పెల్లిలో ఎండిపోయిన పెద్దవాగు



పెంబి మండలం పసుపుల గ్రామంలో ఎడారిలా కడెం వాగు

కాంగ్రెస్ నర్సాపూర్(జి) మండల కార్యవర్గం

నర్సాపూర్(జి): డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ (జి) కాంగ్రెస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్(జి) మండల అధ్యక్షుడిగా గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంఏ.అజీం, ప్రధాన కార్యదర్శిగా గోవింద్‌రెడ్డి, కోశాధికారిగా మాడెగాం గజ్జారాం, జాయింట్ సెక్రెటరీగా సుధాకర్‌నాయక్, బీసీ విభాగం అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మంత్రి శ్రీనివాస్ (రాంపూర్), ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రాథోడ్ ఉత్తం (అంజనీతండా)లను ఎన్నుకున్నారు. అనంతరం నర్సాపూర్(జి), రాంపూర్, కుస్లి, టెంబుర్ని, అంజనీ తండా గ్రామాల గ్రామస్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని వారికి సూచించారు.

గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు. మునిపల్లిలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా కమల్‌కోట రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాంపెల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ సభ్యులుగా రాజకుమార్ రాజశేఖర్, మల్లాపూర్‌లో గ్రామ అధ్యక్షుడిగా హైమద్, సెక్రెటరీగా ముత్యం సభ్యులుగా అశోక్, గంగాధర్, రవి, ధర్మారంలో గ్రామ అధ్యక్షుడిగా మంగలి నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా రాములు, సెక్రెటరీగా శంకర్, సభ్యులుగా దశరథ్ దేవేందర్‌ను ఎన్నుకున్నట్లు రాజేశ్వర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, కార్యదర్శి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి'



పార్టీలో చేరిన వారితో నారాయణ్‌రావు పటేల్



నిర్మల్‌లో శ్రీహరిరావును సన్మానిస్తున్న నేతలు

భైంసాటౌన్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. కుభీర్ మండలం గోడాపూర్‌కు చెందిన మోరె గణేశ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో నారాయణ్‌రావు పటేల్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాపురావు, గంగాధర్, సాహెబ్‌రావు, అహ్మద్ తోపాటు పలువురు గ్రామస్తులు 150 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ చంద్రే, ఓం ప్రకాశ్ లడ్డా, భోజరాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'అభ్యర్థిని గెలిపించుకుందాం'

కడెం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే ఆత్రం సుగుణను గెలిపించుకుందామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ మాట్లాడారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, సలీం, రఫీక్, భూషణ్, రహీం, రాంరెడ్డి, రాజు, బబ్లూ, రమేశ్, షర్ఫుద్దీన్, ఆత్తు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సోన్: జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరినివాసంలో మండల కేంద్రానికి చెందిన గంగపుత్రులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. సోన్ మాజీ సర్పంచ్ సాయన్న ఆధ్వర్యంలో 50 కుటుంబాల గంగపుత్రులు కాంగ్రెస్‌లో చేరగా.. శ్రీహరిరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గంగపుత్ర సంఘ సభ్యులు ఉన్నారు.

అగ్గిమల్లన్న దేవుని ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో అగ్గిమల్లన్న దేవుని ఆలయ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మల్లన్న దేవుడి పట్నాలను ఘనంగా నిర్వహించారు. కుర్మ సంఘంతోపాటు గ్రామస్తులు ఇంటింటా జోగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామికి ధాన్యం, బియ్యం, పలు రకాల పప్పు దినుసులను మల్లన్నస్వామికి సమర్పించారు. ఈనెల 30న రాత్రి ఒగ్గు కథ, 31న గంగాస్నానం, పుట్ట బంగారం, ఏప్రిల్ 1న బోనాలు, లగ్నం, నాగవెల్లి పట్నాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.



జోగు కార్యక్రమంలో భక్తులు

ఆసుపత్రిలో చేరిన యువకుడు

సాక్షి స్పందన

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ ఎస్సీ కాలనీకి చెందిన నడిపి రాజన్న కుమారుడు వరుణ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయమై ఈనెల 26న 'ఆపన్నహస్తం కోసం ఎదురు చూపు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు స్పందించారు. ఈ మేరకు గురువారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతున్న వరుణ్‌ను చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని దేవేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. యువకుడి ఆరోగ్యం మెరుగుపడే వరకు చికిత్స అందేలా చూస్తామని కృష్ణంరాజు పేర్కొన్నారు.



ఆస్పత్రిలో యువకుడితో కృష్ణంరాజు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బావాపూర్(ఆర్)లో ఇస్తున్న కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ బ్లాక్ మేనేజర్ మాలావత్ గణేశ్ అన్నారు. శుక్రవారం పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం స్వావలంబన సాధించాలని కోరారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

ఖానాపూర్: ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో పీఆర్‌టీయూ భవన్‌లో మాట్లాడారు. ఆశవర్కర్లకు నెలసరి పారితోషికంతోపాటు లెప్రసీ సర్వే, ఎన్నికల డ్యూ టీల పెండింగ్ డబ్బులను చెల్లించాలని కోరారు. గంగామణి, సుజాత, స్వాతి, జ్యోతి, దేవిక, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ పనులు పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. వీరి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎక్బాల్‌పూర్ పైపులైన్ నుంచి చేపట్టిన పనులను మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్ పరిశీలించారు. కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్, ఏఈ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.